క్లుప్తంగా

నరసింహస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం



యోగి నరసింహస్వామి

పత్తికొండ(తుగ్గలి) : హోసూరు సమీపంలోని నరసమ్మ తోటలో కొలువైన యోగి నరసింహస్వామి ఆరాధన ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. యోగి నరసింహస్వామి, అమృతేశ్వర లింగం, గణపతి, నాగమ్మ దేవతలకు భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. రథాంగ హోమం నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి భజన బృందాలు భక్తి గీతాలు ఆలపించాయి. ఆలయ ధర్మకర్త సురేంద్ర నాథరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్వీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎస్వీ సుబ్బారెడ్డి

పత్తికొండ(తుగ్గలి) : ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం పత్తికొండలో ఘనంగా నిర్వహించారు. కుమారుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, కోడలు విజయ మనోహరి, కూతురు,అల్లుడు ఎస్.నాగరత్నమ్మ, ఎస్.రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు, నాయకులు, అభిమానుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రియాజ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆలూరు రూరల్: మండలంలోని హత్తిబెళగల్ గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి రియాజ్ రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం శివ ప్రసాద్ బుధవారం తెలిపారు. ఈ నెల 7న ఆలూరు ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి సెపక్ తక్రా పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు.ఈ నెల 17,18 తేదీల్లో ప్రకాశం జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. విద్యార్థితో పాటు పీఈటీ చినబాబును ఉపాధ్యాయులు అభినందించారు.

పిల్లలందరికీ ఆధార్ వచ్చేలా చూడండి



ఐసీడీఎస్ పీడీ నిర్మల

వెల్దుర్తి: అంగన్‌వాడీ పిల్లలందరికీ ఆధార్ కార్డు వచ్చేలా చూడాల్సిన బాధ్యత ఆయా సెంటర్ల నిర్వాహకుల దేనని ఐసీడీఎస్ పీడీ నిర్మల తెలిపారు. బుధవారం వెల్దుర్తి ప్రాజెక్ట్ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించారు. సీడీపీఓ ల్యూక్, సూపర్‌వైజర్లతో మాట్లాడుతూ.. ఆధార్ అథెంటికేషన్‌కు తగిన చర్యలు తీసుకుంటూ, ధ్రువ పత్రాలు సైతం సేకరించి, కార్డు వచ్చేలా చూడాలని ఆదేశించారు.


సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



పత్తికొండ తేరుబజారులో భూమి పూజ చేస్తున్న సర్పంచ్ కొమ్ము దీపిక

పత్తికొండ(తుగ్గలి) : పట్టణంలోని తేరు బజారులో రూ.56 లక్షలతో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ కొమ్ము దీపిక, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. పంచాయతీ నిధులు రూ.24లక్షలు, ఉపాధి హామీ పథకం నిధులు రూ.32లక్షలను కలిపి రోడ్డు వేస్తున్నట్లు చెప్పారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న ట్రైనర్ రామాంజనేయులు

పత్తికొండ(తుగ్గలి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నైపుణ్యాభి వృద్ధి సంస్థ, గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలపై శిక్షణ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంకల్ప్ పథకంలో భాగంగా మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉచిత శిక్షణను నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఆనంద్‌రాజ్‌కుమార్ ప్రారంభించారు. వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా ఎదగడానికి అవసరమైన మెలకువలు, విధి విధానాలపై ట్రైనర్ రామాంజనేయులు శిక్షణ ఇచ్చారు.

బకాయిల గుదిబండ!



> బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో విద్యుత్ శాఖపై భారం

> ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్‌లో రూ.18.07కోట్ల బకాయి

> పేరుకుపోతున్న ప్రభుత్వ శాఖల బిల్లులు

ఆలూరు రూరల్: ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో ప్రభుత్వ శాఖలకు సంబంధించిన విద్యుత్ బకాయిలు పేరుకుపోతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయడం లేదు. దీంతో విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించలేని పరిస్థితి. ఫలితంగా బకాయిలు క్రమంగా పేరుకుపోతూ తడిసి మోపడవుతున్నాయి.

రూ.18.07 కోట్లు..

ఆలూరు,ఆస్పరి,చిప్పగిరి,హాలహర్వి, హొళగుంద మండలాల పరిధిలో గ్రామీణ నీటి సరఫరా పరిధిలో ఉన్న వాటర్ పంప్ హౌస్‌లు, పంచాయతీ రాజ్, తహసీల్దార్, ప్రభుత్వ ఆస్పత్రులు, విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ తదితర శాఖలు ఉన్నాయి. వీటి బకాయిలు మొత్తం రూ.18.07 కోట్లు మేర ఉన్నాయి. దీంతో విద్యుత్ శాఖ అధికారులు బకాయి వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. ఇప్పటికే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ ప్రీపెయిడ్ మీటర్లను ఏర్పాటు చేశారు. అయితే అవి ఇంకా సాంకేతికంగా పనిచేయడం మొదలు కాలేదు. ఇవి అందుబాటులోకి వస్తే ప్రభుత్వ కార్యాలయాల బకాయిల బెడద శాశ్వతంగా తొలగిపోయే అవకాశముంది.

ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కొన్ని ప్రధాన శాఖల బకాయిలు..

ప్రభుత్వ శాఖ	బకాయి మొత్తం
పంచాయతీ రాజ్ శాఖ	: రూ. 17.20 కోట్లు
వైద్యారోగ్య శాఖలు	: రూ. 13.25 లక్షలు
ఆర్‌డబ్ల్యూ ఎస్	: రూ. 5.31 లక్షలు
విద్యాశాఖ	: రూ. 32.72 లక్షలు
తహసీల్దార్ ఆఫీసులు	: రూ. 12.14 లక్షలు
బీసీ వెల్ఫేర్	: రూ. 1.05 లక్షలు
మహిళా శిశు సంక్షేమ శాఖ	: రూ. 5.01 లక్షలు
గ్రామ సచివాలయాలు	: రూ. 2.54 లక్షలు
గిరిజన సంక్షేమ శాఖ	: రూ. 9.67 లక్షలు

నోటీసులు జారీ చేస్తున్నాం



ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్‌లో విద్యుత్ బిల్లులు బకాయిలు ఉన్న కార్యాలయాలకు నోటీసులు జారీ చేస్తున్నాం. సిబ్బంది ద్వారా ప్రతి నెలా బిల్లులు వసూలు చేయాలని సూచనలు ఇస్తున్నాం. సబ్ డివిజన్‌లో వివిధ ప్రభుత్వ కార్యాలయాల నుంచి డిసెంబర్ నెల నాటికి రూ.18.07 కోట్లు రావాల్సి ఉంది.

– బాలచౌడయ్య, ఆదోని డివిజన్ అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్,

నోట్ పుస్తకాల అందజేత

కృష్ణగిరి: మండలంలోని కంబాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం గ్రామస్తులు హెచ్ఎం వెంకటేశ్వర్లుతో కలిసి నోట్ పుస్తకాలు అందజేశారు. నూతన సంవత్సరం సందర్భంగా ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్‌కు అందజేసిన నోట్ పుస్తకాలు, పెన్నులు తదితర వాటిని విద్యార్థులకు అందజేసినట్లు వారు తెలిపారు.

ఆక్రమణదారులకు నోటీసులు

వెల్దుర్తి: స్థానిక బాలుర హైస్కూల్ ప్రహరీ లోపలికి చొచ్చుకొచ్చిన ఆక్రమణలపై జిల్లా పరిషత్ చర్యలు వేగవంతం చేసింది. ఆక్రమణదారులు తమ షాప్‌లను హైస్కూల్ కాంపౌండ్ లోపలికి 70శాతం వరకు నిర్మించుకుని ఉండటంపై ఎంపీడీఓ సుహాసిని తన విచారాణానంతరం బుధవారం సాయంత్రం నోటీసులు జారీ చేశారు. షాపుల నిర్మాణాల స్థలానికి సంబంధించిన ఆధారిత సర్వే నంబరు, పట్టాదారు పుస్తకం, రిజిస్టరు పత్రాలు తదితరాలతో తన కార్యాలయంలో ఈనెల 10వ తేదీన హాజరుకావాలని ఆయా షాపుల యజమానులకు ఇచ్చిన నోటీసులో పేర్కొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు



పెద్దహ్యాటలో మాట్లాడుతున్న తహసీల్దారు సతీష్

హొళగుంద: మండలంలో డిసెంబర్ 6 నుంచి ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు బుధవారం ముగిశాయి. సదస్సుల్లో భూ సమస్యలకు సంబంధించి మొత్తం 285 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు సతీష్ తెలిపారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీ పరిధిలోని 20 రెవెన్యూ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించినట్లు చెప్పారు. చివరి రోజు పెద్దహ్యాటలో జరిగిన సదస్సులో 3 అర్జీలు వచ్చాయని ఆయన వెల్లడించారు. సర్వే డీటీ ముకుందరావు, ఎంపీటీసీ శివన్న, వీఆర్‌ఓ ప్రహ్లాద పాల్గొన్నారు.

హలిగేరలో 20న రీసర్వే..

ఆస్పరి: ఈనెల 20 తేదీన మండలంలోని హలిగేర గ్రామంలో భూములను రీ సర్వే చేపట్టనున్నట్లు తహసీల్దార్ శశిశంకర్ నాయక్ తెలిపారు. బుధవారం మండలంలోని హలిగేర గ్రామంలో రీ సర్వేపై ర్యాలీ, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.తహసీల్దార్, రీ సర్వే డీటీ భీమేష్ మాట్లాడుతూ భూములున్న రైతులు రీ సర్వేకు సహకరించాలని కోరారు. గ్రామంలో 463 సర్వే నంబర్లు, 4,260 ఎకరాల భూమి ఉందని చెప్పారు. సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్‌ఓ రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆస్పరి: మండలంలోని యాటకల్లు గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామ రైతులు భూ సమస్యలు పరిష్కరించాలని డీటీ భీమేష్‌కు దరఖాస్తులు ఇచ్చారు. సర్పంచ్ సుధమ్మ, సచివాలయం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పత్తికొండ(తుగ్గలి) : తుగ్గలి మండలం పగిడిరాయిలో తహసీల్దార్ రమాదేవి, పత్తికొండ మండలం జూటూరులో మండల సర్వేయర్ గాదిలింగప్ప ఆధ్వర్యంలో బుధవారం రీ-సర్వేపై ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు ఆధ్వర్యంలో భూ సర్వే చేయనున్నట్లు చెప్పారు. గురువారం రీ సర్వేపై ఆయా గ్రామాల్లో గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.సర్పంచ్ జయశ్రీ, మాజీ సర్పంచ్ ఈశ్వరప్ప, తుగ్గలి మండల సర్వేయర్ సుధాకర్, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్

దేవనకొండ: ఇచ్చిన లక్ష్యాలను రైతు సేవా కేంద్రం సిబ్బంది పూర్తి చేయాలని ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌కి సంబంధించి పంటల నమోదు, రైతుల ఈ-కేవైసీ పూర్తి చేయాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ బీమాకు సంబంధించిన పంటల ధ్రువీకరణ పత్రాలను పోర్టల్‌లో జనరేట్ చేయాలన్నారు. అలాగే హార్టికల్చర్ ఆఫీసర్ దస్తగిరి మాట్లాడుతూ పండ్ల తోటల విస్తరణ పథకం గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు, ఏఈఓలు రంగన్న, మల్లికార్జున, అబ్దుల్‌సలాం, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

ట్రెజరీ కార్యాలయం తనిఖీ



జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావును సన్మానిస్తున్న ఏపీ ఎన్‌జీవో సంఘం నాయకులు

పత్తికొండ(తుగ్గలి) : వార్షిక తనిఖీల్లో భాగంగా పట్టణంలోని సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావు బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి పలు అంశాలపై సబ్ ట్రెజరీ అధికారిణి ఉమాదేవికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావును ఎన్జీవో సంఘం నాయకులు సాయిబాబా, వెంకటరమణ, రమేష్, నాగేంద్ర, రంగనాథ్, రంగస్వామి సన్మానించారు.

సన్మార్గానికి పాదయాత్ర



వెల్దుర్తికి చేరుకున్న శివకరణ్‌సింగ్‌ను సన్మానిస్తున్న స్థానిక పీఠాధిపతులు, నాయకులు

వెల్దుర్తి: దేశంలోని ప్రజలు ఆధ్యాత్మికతో కూడిన సన్మార్గంలో నడవాలని పాదయాత్ర సాగిస్తున్నట్లు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సతేపూర్ జిల్లా కరోలి గ్రామానికి చెందిన శివకరణ్ సింగ్ అన్నారు. కన్యాకుమారి నుంచి ఒడిశాకు పాదయాత్ర సాగిస్తున్న ఆయన బుధవారం హైవే 44పై వెల్దుర్తి మీదుగా సాగుతూ హనుమాన్ జంక్షన్‌లోని 52 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహ నిర్మాణం సాగిస్తున్న ప్రాంతంలో బస చేశారు. అభయాంజనేయస్వామి ఆలయ పీఠాధిపతి రామాంజనేయులు, హెల్పింగ్ హ్యాండ్స్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు హరిసింహనాయుడు, బీజేపీ నాయకురాలు శాంతి, యాదరాల అన్నసూర్యుడు, వెల్దుర్తి ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు సుప్రియ వెంకటేశ్వర్లు ఆయనను ఆహ్వానించి సత్కరించారు. శివకరణ్ సింగ్ మాట్లాడుతూ ప్రస్తుత పాదయాత్ర ఒడిశా రాష్ట్రం చేరుకుని అక్కడి నుంచి తిరిగి కాశ్మీర్ వరకు సాగుతుందన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

వెల్దుర్తి: పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలం, గృహ నిర్మాణాలకు రూ.5లక్షలు వెంటనే ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాథం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మకు వినతిపత్రం సమర్పించారు. మండల కార్యదర్శి టి.కృష్ణ, పట్టణ కార్యదర్శి గిరి, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు మాధవస్వామి, వ్యవసాయ, కార్మిక, చిన్న వ్యాపార, మిని ఆటో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోండి

కృష్ణగిరి: ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ మద్దిలేటి సూచించారు. మండలంలోని లక్కసాగరం, ఆగవేలి సబ్‌స్టేషన్‌లను బుధవారం సందర్శించారు. అన్ని గ్రామాల్లో ఈ పథకం రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

10న మహదేవప్ప తాత ఆరాధన

ఆస్పరి: నగరూరు గ్రామంలో వెలసిన మహదేవప్ప తాత 37వ ఆరాధనోత్సవాలు ఈనెల 10వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. శుక్రవారం ఆలయంలో మహదేవప్ప తాతకు గంగ, గణపతిపూజ, రుద్ర, క్షీరాభిషేకం, రథోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు.

హామీలు అమలు చేయాలి

ఆలూరు: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు భూపేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో సీపీఐ కార్యకర్తలు, హమాలీ సంఘం కార్మికులు, యూనియన్ నాయకులతో సమావేశమయ్యారు. 10న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తామని విజయవంతం చేయాలని కోరారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మద్దికెర : పదిలో వంద శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ రంగస్వామి అన్నారు. బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జోన్ మండలం చిన్న మల్కాపురం గ్రామానికి చెందిన డాక్టర్ వీఆర్ యాదవ్ అందజేసిన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు.

కురబలకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

ఆలూరు: మాదాసి,మాదారి కురుబ కులస్తులకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలని నియోజకవర్గ మాదాసి,/మాదారి కురుబ రిజర్వేషన్ పరిరక్షణ సమితి కన్వీనర్ కాడికే రాజ్, గౌరవ అధ్యక్షుడు రంగన్న కోరారు. ఈమేరకు బుధవారం తహసీల్దార్ గోవిందు సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కులగణన సర్వే జాబితాలో కురుబ కులస్తులను చేర్చారన్నారు.

9న భజన, 10న బండలాగుడు పోటీలు

వెల్దుర్తి: పాలుట్ల రంగస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం రాత్రి భజన పోటీలు ఉంటాయని నిర్వాహకులు బుధవారం తెలిపారు. విజేతలకు వరుసగా రూ.15వేలు, రూ.12వేలు, రూ.9వేలు, రూ.6వేలు, 4వేలు, 3వేలు, 2వేలు, వెయ్యి నగదు బహుమతులుంటాయని, పోటీల్లో పాల్గొన దలచిన టీంలు రూ.300 చెల్లించి 9951021576, 9912946598 నంబర్లలో సంప్రదించాలని కోరారు. అలాగే..10న న్యూ కేటగిరి వృషభాలకు బండలాగుడు పోటీల విజేతలకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందిస్తామన్నారు. గుండు ఎత్తు పందెం విజేతలకు వరుసగా 5 తులాలు, 3 తులాల వెండి పతకం బహూకరిస్తామన్నారు. 9948324919 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఐసోలేషన్ వార్డు పరిశీలన



వైద్యులతో మాట్లాడుతున్న మాధవీలత

వెల్దుర్తి: స్థానిక సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో (సీహెచ్‌సీ) ఐసోలేషన్ వార్డు ఏర్పాటుపై డీసీహెచ్ఎస్ మాధవీలత సంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఆమె సీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఓపీ, రోగులు, అందుతున్న సేవలను పరిశీలించారు. అనంతరం 5 బెడ్లు ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్‌తో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డు పరిశీలించారు. ప్రస్తుతం నూతన వైరస్ హెచ్ఎంపీవీ విస్తరించే అవకాశాల నేపథ్యంలో జిల్లాలో వీలైన, స్థానికంగా అవకాశమున్న అన్ని ఆసుపత్రుల్లో ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు డీసీహెచ్ఎస్ తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ బాలచంద్ర రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు రంగస్వామి, ప్రసాద్, రాజశేఖర్, సాహిత్య ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ



హొళగుందలో విచారణ చేస్తున్న పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య

హొళగుంద: స్థానిక వారపు సంత మార్కెట్ వద్ద కిరాణ కొట్టు నడుపుకుంటున్న హరిజన మల్లేష్, పండ్ల వ్యాపారి అల్లబకాష్ మధ్య దుకాణం స్థలం విషయంలో ఘర్షణ జరిగింది. అయితే ఈ క్రమంలో అల్లబకాష్ తనను కులం పేరుతో దూషించాడని మల్లేష్ కోర్టును ఆశ్రయించాడు. దీంతో కోర్టు ఎండార్స్‌మెంట్ ప్రకారంగా అల్లాబకాష్ మరో ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఇందులో భాగంగా.. కేసు విచారణ మిత్తం..పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య బుధవారం మండల కేంద్రంలో విచారణ చేపట్టారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసుకు సంబంధించి విచారణ నివేదికను కోర్టుకు అందజేస్తామని వెల్లడించారు. ఆయన వెంట ఎస్ఐ బాల నరసింహులు, ట్రైనీ ఎస్ఐ బాషా, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, వీఆర్‌ఓ తిప్పన్న ఉన్నారు.

రైతులను మోసం చేస్తే చర్యలు



జొహరాపురంలో కాటాను పరిశీలిస్తున్న అధికారి శ్రీనివాసులు

ఆస్పరి: తూనికలు, కొలతల్లో రైతులను ఎవరైనా మోసం చేస్తే చర్యలు తీసుకుంటామని ఆదోని తూనికలు, కొలతల శాఖ అధికారి శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని జొహరాపురం గ్రామంలో రంజాన్ అనే వ్యాపారి రైతుల నుంచి కందులు కొనుగోలు చేసే క్రమంలో తూకంలో తమను మోసం చేస్తున్నారని రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం రంజాన్ ఇంట్లో కాటాను పరిశీలించారు. తూకాల్లో తేడాలు రావడంతో వ్యాపారి రంజాన్‌కు రూ.50వేల జరిమానాతో పాటు రెండు కాటాలను సీజ్ చేసినట్లు చెప్పారు. మరోసారి ఇదే తప్పు చేస్తే కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

పార్కింగ్ ప్లేస్ కాదు..



హొళగుంద బస్టాండులో వాహనాలను నిలిపిన దృశ్యం

హొళగుంద: స్థానిక బస్టాండ్ పార్కింగ్ ప్లేస్‌లా మారింది. నిత్యం దుకాణాలకు వచ్చే వారు తమ వాహనాలను ప్రధాన రోడ్డుతో పాటు బస్టాండ్ ఆవరణలో నిలుపుతుండటంతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు నిలిపేందుకు స్థలం లేక రోడ్డుపై ఆపుతుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.



నాడు గుంతల్లో మురుగునీరు నిలిచిన దృశ్యం



గుంతలు పూడ్చి సీసీ రోడ్డు వేయించిన దృశ్యం

గుంతలు పూడ్చి.. అవస్థలు తీర్చి!

మద్దికెర : స్థానిక మద్దమ్మ దేవాలయం నుంచి వెళ్లే కవిరెడ్డి వీధి కొండను పగులగొట్టడంతో ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలతో అధ్వానంగా ఉండేది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతేండేవారు. గతంలో దారి ఉన్నా గుంతలు పడి రాళ్లతో నిండిపోవడంతో నడిచేందుకు వీలు కానట్లుగా ఉండింది. దీంతో దారులు మూసుకుపోయి వర్షం నీరు నిలిచి దుర్గంధం వెదజల్లేది. అటువైపు ఉన్న గడ్డివాముదొడ్లు, అంత్యక్రియలుకు వెళ్లాలన్నా దారి లేక చుట్టూ తిరిగి నడక సాగించాల్సి వచ్చేది. అలాగే.. ఆ ప్రాంతంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్ నిర్మించడంతో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడ్డారు. రోడ్డు వేయాలని గతంలో పలుమార్లు సంబంధిత అధికారులను, ప్రజా ప్రతినిధులను సంప్రదించినా పట్టించుకోలేదు. అయితే వైఎస్సార్‌సీపీ నాయకులు సమస్యను ఎంపీపీ అనిత దృష్టికి తీసుకెళ్లడంతో ప్రత్యేక చొరవ తీసుకొని మండల నిధులు రూ.10 లక్షలు వెచ్చించి గుంతలన్నింటినీ పూడ్చించి సీసీ రోడ్డు వేయించారు. దీంతో తాము పొలాలకు, గడ్డివాముదొడ్లకు, శ్మశానానికి, నిత్యం రాకపోకలు సాగించేందుకు అవస్థలు తప్పాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీహెచ్ఎస్‌లో రేకుల టాప్ వేయించిన పూర్వ విద్యార్థి మారెల్ల రాజశేఖరరెడ్డి



జొన్నగిరి జెడ్పీహెచ్ఎస్‌లో రూ.లక్షతో బోర్డు ఏర్పాటు చేయించిన 1990-91 బ్యాచ్ విద్యార్థులు



లక్ష్మీతండాలో గ్రామస్తుల సాయంతో నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న దృశ్యం

బడికి బాసటగా..

- చదివిన పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత
- పలు అభివృద్ధి పనులకు సహకారం
- ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

తమ అవసరం తీరాక అప్పటి వరకు వినియోగించుకున్న, ఉపయోగపడిన వాటిని ఆ తరువాత పట్టించుకోకపోవడం మానవ నైజం. అయితే ఇందుకు కొందరు మినహాయింపుగా నిలిచిన వారే ఆదర్శంగా నిలుస్తారు. ఆ కోవలోకే వస్తారు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన విద్యార్థులు. తాము చదివిన బడిలో సౌకర్యాల కల్పనకు తమ వంతుగా సహకారమందిస్తున్నారు. అలాగే.. పది పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు కొన్నేళ్లుగా నగదు బహుమతులందించి ప్రోత్సహిస్తున్నారు. దీంతో వారి సేవా స్ఫూర్తిని పలువురు అభినందిస్తున్నారు.

తుగ్గలి : పూర్వ విద్యార్థులు, పూర్వ ఉపాధ్యాయులు, దాతల సేవా స్ఫూర్తితో పలు పాఠశాలల్లో మౌలిక వసతులు సమకూరుతున్నాయి. తాము చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలన్న సంకల్పంతో పూర్వ విద్యార్థులు ముందుకు వస్తున్నారు. పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి మారెల్ల రాజశేఖరరెడ్డి పాఠశాలలో రూ.50 వేలతో రేకుల టాప్ వేయించారు.

అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు టీచర్ శివశంకర్‌రెడ్డి, ఆయన సోదరులు పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు 16 ఏళ్లుగా ఏటా రూ.5, రూ.3, రూ.2వేల చొప్పున నగదు బహుమతులు అందిస్తున్నారు.

- జొన్నగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1990–91 బ్యాచ్ విద్యార్థులు రూ.లక్షతో పాఠశాల బోర్డు, నీటి ట్యాంకు ఏర్పాటు చేయించారు.
- 1992 బ్యాచ్ విద్యార్థులు పాఠశాలలో మినరల్ వాటర్ మిషన్‌కు షెడ్ వేయించారు. తాగునీటి బోరు ఏర్పాటు చేయించారు.
- 1995–96 బ్యాచ్ విద్యార్థులు రూ.4లక్షలు ఖర్చు చేసి విద్యార్థులకు డైనింగ్ హాల్ ఏర్పాటు చేయించారు.



జొన్నగిరి జెడ్పీహెచ్ఎస్‌లో డైనింగ్ హాల్ ఏర్పాటు చేయించిన 1995-96 బ్యాచ్ విద్యార్థులు

- పూర్వ విద్యార్థులతో పాటు పూర్వ ఉపాధ్యాయులు కూడా తమ వంతు సహకారం అందించారు. ఇదే పాఠశాలలో విశ్రాంత తెలుగు పండితులు దివంగత ఎస్ఎల్ఎన్ మూర్తి సైకిల్ స్టాండ్ షెడ్, మరో తెలుగు పండితులు దివంగత చెంచు రామిరెడ్డి సరస్వతీ దేవి విగ్రహానికి గ్రిల్ ఏర్పాటు చేయించారు.
- లక్ష్మీతండా ప్రాథమిక పాఠశాలలో గ్రామస్తులు రూ.40 వేలతో పాఠశాల విద్యార్థుల కోసం మరుగుదొడ్లు నిర్మించారు.